ధీరజాత భర్త చటుక్కున అన్నాడు. " అబ్బే అది నిజం దిగుడుబావి కాదండి మా గొట్టంబావుల కంపెనీ వాళ్లు మా అయిదంతస్తుల ఎపార్టుమెంట్‌కి పెట్టిన ముద్దుపేరు." అంతా తెల్లబోయారు. జవసత్వం పక్కకి తిరిగి నవ్వుకున్నాడు. ఆమైన అన్నాడు , " ధీరజాతగారూ మీ సమస్యని పరిష్కరించుకున్నారు. మరి నా సమస్య మాటేమిటి?" ధీరజాత అంది - " మా అమ్మ తెచ్చిన కట్నం డబ్బు ఖర్చు పెట్టేసినందుకు బదులుగా మా అమ్మ మా నాన్నదగ్గర్నించి ఈ ఇల్లు తన పేర రాయించుకుంది. అంటే, ఈ ఇంట్లో నాక్కూడా వాటా ఉంది. కనుక నాకు అధికారం కూడా ఉంది. మీరుంటానంటే నేను సై అంటాను... అమ్మా! నువ్వేమంటావే?" తల్లి అంది- " నువ్వు బుద్ధిమంతుడివి బాబూ! ఎట్లాగోట్లా ఆమూడు ముళ్ళూ పడిన శుభ సమయమిది. ఈ సందర్భంగా నువ్వుంటానంటే కాదంటానా? నేనూ సైసై అంటాను."

" మరి నువ్వేమంటావ్ బావా?" అంది ధీరజాత. అతను - " మా ధీర ఏం చెప్పినా లోతుగా అలోచించి మరీ చెబుతుంది. కనక నేను సైసైసై అంటాను" అన్నాడు. చటుక్కున జవసత్వం - " అవునవును, ధీరజాతగారు ఏం చెప్పినా లోతుగానే చెబుతారు, ఏం చేసినా లోతుగానే చేస్తారు- దిగుడు బావంత లోతుగా!" అంతా ఫక్కున నవ్వారు. పోలీసుకు కూడా నవ్వక తప్పలేదు. నారాచరావు అసలక్కడ లేడు. తన వాటాలో కెళుతూ జవసత్వం అనుకున్నాడు- ' ధీరజాత నా ఐడియా అందుకుంటుందనుకోలేదు. ఇంత త్వరగా నా ప్లాను ఫలిస్తుందనీ అనుకోలేదు! అమ్మయ్య ఇక ఈ వాటా ఖాళీ చెయ్యక్కర్లేదు కదా! కానీ, మళ్లీ వచ్చిపడ్డ ఈ ఎలుకల్ని బొద్దింకల్ని వదిలించుకోవటం ఎలా?'

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 15-8-90)

★★★ ★★★ ★★★

# దీపా-వళి

" ఈ రోజు **దీపావళి.** అజ్ఞానాన్నీ లోభమోహాల్ని, మత్తునూ నాశం చెయ్యవలసిన రోజు. అందరూ ఆ పని నూనె దీపాలతో చేస్తారు. మనం కాగితం దీపాలతో చేద్దాం." వాళ్ళుచేసుకున్న ఆ దీపావళి వెనుక ఉన్న సరదా కథే ఇది!

అర్థరాత్రి ముదిరిన కృష్ణపక్షమి చీకటి. ఆ ఆవరణ అంతటా నిండి ఉన్న ఎత్తైన చెట్ల కొమ్మల్లోంచి ఏ కొన్నయినా నక్షత్రాలు కనిపిస్తున్నాయీ అంటే, ఆ కొన్ని కూడా కనిపించకుండా ఆకాశ మంతటా నల్లగా దట్టంగా అలుముకున్న జీమూతాలు. వెలుగు రేఖ అన్నమాటే లేకపోగా ఉండుండి తీతువు కూతలు. ఊరికి దూరంగా ఉన్న ఆ ప్రదేశంలో మనిషన్నవాడెవడూ లేదు, ఉండలేదు కూడా . అది శ్మశానం కనుక! కానీ ప్రాణులు కాని ప్రాణులు రెండు మాత్రం అక్కడున్న కొండ తంగేడు చెట్టు కొమ్మ మీదికి చేరాయి. అసలు కొన్ని క్షణాల క్రితం ఏంజరిగిందంటే- ఆ కొండతంగేడు చెట్టు కింద ఆ కిందటి పగటి పూట శవం ఒకటి పాతి పెట్టబడింది. ఆ సమాధిలోంచి నీలిరంగు వలయాలు ఇప్పుడు పైకి రావటం మొదలు పెట్టాయి. వెంటనే అంతవరకూ అచుట్టుపక్కల కొమ్మల్లో తిరుగుతున్న బొటన వేలంత పొడుగు ఉన్న ఆకారం లేని ఆకారం ఒకటి రివ్వున దూసుకొచ్చి ఆ మొదటి వలయాన్ని అడ్డుకొంది. " ఆగు ఎవరు నువ్వ నవలా రచయిత్రి ప్రాణానివేనా?" అంది.

ఆ నీలి వలయం ఆగిపోయింది మిగతా వలయాలన్నీ మాయ మయ్యాయి. ఆ వలయం అంది - " అవును, రచయిత్రి కరదీపికా దేవినే అయినా నీ కెందుకు? అసలు నువ్వెవరు?" ఆ ఆకారం అంది - " నేను నీ నవల్లోని హీరోయిన్ దీపను. నీ నవలను నీ ఇంట్లో బీరువాలో పెట్టి దాచారు నీ వాళ్లు భద్రంగా, వాళ్లు నీ కట్టెను పాతిపెట్టినప్పటి నుంచి నేను ఆ నవల్లోంచి బయట కొచ్చి కాసు క్కూర్చున్నా నిక్కడ, నువ్వెప్పుడు బయటి కొస్తావా అని ".

"నాతో నీకేం పని?" కరదీపికా దేవి కదలి పై కెళ్లబోయింది. దీప అంది -" ఆగాగు చాలా పనుంది. వారం రోజుల నుంచి ఎంతటి గుండెకోత అనుభవిస్తున్నానో నీకేం తెలుసు? నీకన్నా ముందే గతించిన దాన్ని నేను. కనుక నీతో మాట్లాడటం కుదరలేదు. ఇప్పుడిద్దరం ఒకే స్థాయిలో ఉన్నాం కనుక అవకాశం దొరికింది ఆగు !"... " ఆగటానికి వీల్లేదు. ఎవరో నాకు ఉచ్చువేసి లాగుతున్నారు. ఆ బలాన్ని ఎదిరించి నిలవటం నా వల్ల కాదు. వెళ్లిపోవాలి".

"ఆగక తప్పదు. నీ సొంత హీరోయిన్‌ను. ఆ మాత్రం మమకారం లేదా?" ..." సరే, పద ఇదిగో ఈ చెట్టు కొమ్మ మీదకి చేరదాం". ఈ విధంగా ఆ రెండు ప్రాణులూ ఆ కొండతంగేడు చెట్టు మీదకు చేరాయి. తమకన్నా బలమైనవాడు మనిషి. ఆ మనిషెవడూ ఆ చుట్టుపక్కల లేడు కనుక ఈ రెండూ స్వేచ్ఛగా మాట్లాడుకున్నాయి.

★ ★ ★

కరదీపికా దేవి అంది - "ఊఁ ఏవిటీ గుండెకోత అనుభవిస్తున్నావా, ఎందుకు?" దీప చెప్పింది; " ఎందుకో తెలియదా? నువ్వు రాస్తూ రాస్తూ ఉన్న నా ప్రేమ కథను అర్ధంతరంగా సగంలో ఆపేశావు. అది గుండెకోత కాదా? ఏ కన్నెపిల్ల సహించగలదో చెప్పు. పదిమందినీ అడిగి మరీ చెప్పు, పోనీ !" విసుగ్గా అంది కరదీపికాదేవి - " ఏ వమ్మోయ్ నీ కథను నేను ఆపాలని ఆపలేదు. పరిస్తితి నా చేతిలో లేక అదే ఆగిపోయింది. అంతే! అసలయినా నేనే కీర్తిశేషురాలినయిపోతుంటే నీ గురించి ఎక్కడ పట్టించుకోను? బాగుందమ్మా ఇల్లు కాలి ఒక డేడుస్తుంటే ఒళ్ళు కాలి ఇంకోడేడ్చాట్ట హు!"

"ఏమిటీ, పరిస్థితి నీ చేతిలో లేకపోయిందా! నవల్లో సగం దాకా నన్ను పెంచి పోషించావు. చటుక్కున కథ ఆపేశావు. అలా వదిలేసినా పోయేది. హఠాత్తుగా కొత్త ప్రకరణం మొదలు పెట్టి మూడే మూడు వాక్యాలతో - అదే 'ఆ సుందర కుమార సౌందర్య రాశి, ఆ ముగ్ధమనోహర ప్రేమమయ నయన దీపిక, ఆ బాల, ఆ బేల ఆ హేల,రాజస్థాన్ వెళ్లిపోయిన తన ప్రియుడితో బాటు తను కూడా వెళ్ళలేకపోయాననే క్షోభతో ఆ రాత్రంతా తల్లడిల్లిపోయింది. విరహం భరించలేక ఆ ఊరి చెరువులో ఆమె శవమై తేలింది. ఆ శవాన్ని బయటకు తీస్తుంటే పోస్ట్‌మేన్- దీపమ్మగారూ! మీకు రాజస్థాన్ నుంచి ఉత్తరం వచ్చిందండీ - అంటూ వచ్చాడు 'అనే వాక్యాలతో ముగించావు. మిగిలిన సగం నవల కూడా రాసేసి నా కథను కామెడీగా ముగింపు చేస్తావని కళ్లల్లో వత్తులు వేసుకుని నేను ఎదురు చూస్తుంటే, చటుక్కున నా కిలా భూమ్మీద నూకలు చెల్లించేశావు. ఇది ఏం న్యాయం అని అడుగుతున్నాను".

"ఇందులో న్యాయా న్యాయా లేమున్నాయి? నాకు వీలయినట్లు నేను రాశాను".

"అన్యాయాలు ఒకటి కాదు, నా ప్రియుడు రాగరాజుకూ, నాకూ ఎడబాటు పెట్టావు సరే నానా అవస్థలు పడి ఎలాగో మే మిద్దరం కలిశాం. అతనికి అమెరికాలో సీటొచ్చింది. రాజస్థాన్‌లోని పిలానీలో

కూడా సీటొచ్చింది. కానీ మే మిద్దరం అమెరికాయే వెళ్ళిపోవాలనుకున్నాం. మేం హోటల్ కెళ్లి ఐస్‌క్రీం తిన్నామో, లేదో ఆదరాబాదరా అతన్ని రైలెక్కించేసి రాజస్థాన్ పంపించేశావు. పోనీ ఆ రాజస్థాన్ అయినా నన్ను కూడా పంపించావా అంటే అదీలేదు! చటుక్కున కథ ముగించేసేసి నన్ను చంపేశావు. అది చాలక అతని దగ్గర నుంచి ఉత్తరం రప్పించి నా ఆత్మను మంగలంలో పెట్టి వేయించావు - ఇన్నా? బాధ్యత గల ఒక రచయిత్రి చేతిలో ఇన్ని అన్యాయాలా!"

కరదీపికా దేవి రెండు క్షణాలాలోచించింది. "ఓహో! అదా నీ బాధ - మీ ఇద్దరినీ అమెరికా పంపించలేదనా !" అంది.

"అవును అసలు అమెరికా వెల్లటమే నా లక్ష్యం. అందుకోసమే నేను ప్రేమించాను. మాది స్వచ్ఛమైన ఒరిజినల్ ప్రేమ. కనీసం నన్నయినా అమెరికా పంపించి ఉండాల్సింది. నా వెనకాల అతనొచ్చేవాడు వెతుక్కుంటూ. అప్పుడింత బాధుండేది కాదు. నా కథ రాసిన దానిని నా మనసు నీకు తెలియదా?"... " తెలుసులే, సరే కానీ మీది నిజంగా స్వచ్ఛమైన ప్రేమే నంటావా?"

దీప చిన్నబుచ్చుకుంది. ఆమె గొంతులో రోషం తొంగి చూసింది. " ఏమిటీ మా ప్రేమను సందేహిస్తున్నావా? మేమసలు మొట్ట మొదట ఎక్కడ కలుసుకున్నామో తెలుసా? త్యాగ పూరితమైన వాతావరణంలో, 'భగ్న ప్రేమికుల భద్రతా గృహం' నిర్మాణానికి మా కాలేజీలో మేం వేసిన బెనిఫిట్ షో నాటకంలో నేను గ్రీన్ రూంలో కూర్చుని మేకప్ చేసుకుంటున్నాను. అందుకోసమే వచ్చిన రాగరాజు మత్తు మత్తుగా మెచ్చుకోలుగా చూశాడు" అంది.

"నీ వైపా?".. "కాదు, నా పొట్ట వైపు"... "ఓహో! ఏంటిట అక్కడి అందం - పోక ముడా, కుచ్చిళ్లా?"... "కాదు, వళులు - అంటే పొట్ట మీది ముడతలు. అవి ఈ పక్కనుంచి ఆ పక్కకు బాగాసాగి ఎంతో లోతుగా ముచ్చటగా కనిపించాయట అతనికి. వళులు ఎంత లోతుగా ఉంటే అంత బాగా ప్రేమిస్తారట ఆడపిల్లలు కనుక నాలో రెస్పాన్స్ బాగా ఉంటుందని గ్రహించాడట"

కరదీపికాదేవి చటుక్కున తన పొట్ట వైపు చూసుకోబోయింది. నిట్టూర్చి అంది - "అయ్యో రాత . ఇంకెక్కడి ముచ్చట ! నా కట్టె కాస్తా మట్టి అయ్యేపోయింది గదా!"

" పోన్లే మళ్లీ జన్మ కొస్తుంది. ఏం, నేను కాంటీన్‌లో కూర్చునుండగా తను నా ఎదురుగా కూర్చుని ఆ రోజు నేను కట్టుకున్న చీరలో నా వళులు ఎంత అందంగా కనిపిస్తున్నాయో రోజూ వర్ణించి చెబుతుండేవాడు రాగరాజు.

"కొంత కాలానికి నేను ఖాయం చేసేసుకున్నాను అతను నన్ను ప్రేమిస్తున్నాడని. అయినా ప్రేమకు పరీక్ష ఉంటుంది గదా! అందుకని ఓ రోజున నేను ఓ చిన్న సైజు దిండు పొట్టకు కట్టుకుని మడీదార్ - పైజామా డ్రెస్సు వేసుకుని కాలేజీ కెళ్లాను. అతను దిగాలు పడిపోయి - "అయ్యో! అన్నం అరక్క పొట్ట ఉబ్బరించినట్టుంది" అంటూ రయ్‌మని తన రూమ్‌కెళ్లి హోమియో మందు నక్స్ వామికా తెచ్చిచ్చాడు. అతనెంత త్యాగమూర్తో నా కర్థమయింది. అయినా నేను ఆగకుండా మా స్నేహితులందరినీ అడిగాను - " ఏమే మీ బాయ్ ఫ్రెండ్స్ మిమ్మల్ని ఏం చూసి ప్రేమిస్తున్నారే" అని. మొహం, జడ, చదువు, డబ్బు, సంప్రదాయం చట్టుబండలూ చెప్పారే గానీ, " నా వళులు చూసి నన్ను ప్రేమిస్తున్నాడే నా వాడు" అని ఒక్క చంచలాక్షి చెప్పలేదు. చాలామంది " మా కసలు ఒళ్లే లేదు. వళు లెక్కడ తెద్దాం'

' అంటూ మూతులు తిప్పుకున్నారు కూడా. అప్పుడు నా కెంత గర్వ మనిపించిందో తెలుసా? అప్పుడు నమ్మాను రాగరాజు ప్రేమను. అప్పటినుంచి నేను కూడా అతన్ని గాఢంగా ప్రేమించటం మొదలుపెట్టాను. ఇదంతా నీకు తెలుసు కదా!''

''అవునవును, జ్ఞాపకం వస్తోంది''... ''మా ప్రేమ ఎంత గాఢమైనదో ఎలా చెప్పను ఒకళ్లను విడిచి ఒకళ్లం మే మసలు ఎంతో కాలం ''..

చటుక్కున అంది కరదీపికా దేవి. ''ఉండలేరు''... '' కాదు, ఉండగలం విరహ సుఖాలను అనుభవిస్తూ. ఇంకా నిద్రాహారాలు లేకుండా కూడా మేము...''.. ''ఉండగలరు''... ''కాదు, ఉండలేం. ఎందుకంటే ప్రేమించుకోటానికి సత్తా ఉండాలి గదా ! ఇంకా మమ్మల్ని ఎవరు విడదీసినప్పటికీ...'' ...''విడిపోరు''... ''కాదు విడిపోతాం గొడవలొస్తాయని ఆ తర్వాత మళ్లీ కలుస్తాం''..''బాగుందమ్మా!'' ... ''ఉంది కదూ! అతనికి అమెరికాలో సీటొచ్చిందని తెలిసినప్పటి నుంచి నా గాఢ ప్రేమ కాస్తా ఘాటు ప్రేమగా మారిపోయింది''.... '' చ్చొ చ్చొ ప్రేమ ఘాటు తట్టుకోవటం కష్టమే''... ''పాప మేమిటి గీపం ! అతన్ని నువ్వు అమెరికా ఎందుకు పంపలేదు?''... ''అతనక్కడ చదువు కోసం అప్లికేషన్ పెట్టుకున్నాడు నిజమే సీటొచ్చింది నిజమే కానీ...'' ...'' కానీ?''... '' పిలానీలో కూడా సీటొచ్చింది గదా ! పిలానీ ఇంజనీరింగు చదువు మాత్రం తక్కువదా?'' ...''పోనీ ఎలాగోలా నన్నయినా పంపించాల్సింది''... '' ఆడపిల్ల నొక్కత్తెనీనా ! బాగుంది. అతన్ని పంపించటానికే ఆలోచిస్తుంటే!''... ''ఏంటీ, ఆడపిల్లని కాబట్టి పంపించలేదా? సెక్సీజం చూపించావన్నమాటా!'' ...'' చూడమ్మా నేను సామాన్య రచయిత్రిని కనుక నాకు ఏ ఇజాలు, సిద్ధాంతాలు లేవూ. అదలా ఉండనీ. ఇప్పుడు చాలామంది హీరోలని హీరోయిన్లనీ అమెరికాలో ఆక్‌లాండ్‌కు పంపిస్తున్నమాట నిజం . అక్కడ సైన్సు చదువు బాగా అభివృద్ధి చెందిన మాటా కరెక్టే . నా హీరో రాగరాజు అక్కడ చదువుకోవాలనుకున్నాడు. జి.ఆర్.యి, ట్రాపీ పరీక్షలు రాశాడు.''... '' ట్రాపీ పరీక్ష కాదు. టోఫిల్ పరీక్ష!'' ...'' అదేలే, ఏదో పరీక్ష అది రాశాడు. వారం రోజుల్లో వచ్చి చేరిపొమ్మని విసికిసి యూనివర్సిటీ నుంచి పిలుపొచ్చిన మాట వాస్తవం'' .. '' విసికిసి కాదు, విస్కాన్సిన్'' ... '' ఆఁ మరేమరే అక్కడ నుంచి పిలుపొచ్చింది. కానీ అదే సమయానికి పిలానీ నుంచి కూడా ఉత్తరం వచ్చింది. మూడే రోజుల్లో వచ్చి చేరిపొమ్మని టైము లేదు కనుక ఐస్ క్రీం తినటానికి మాత్రం నీతో గడిపి , ఆ పని అయిపోగానే రైలెక్కేశాడు రాగరాజు. నేనేం చేయను? అయినా అమెరికా మీద నీ కంత మోజెందుకమ్మా?''

'' ఎందుకో ఇదివరకే చెప్పాను. రాగరాజు టోఫిల్ పరీక్ష రాస్తున్నపుడు నువ్వే నాచేత అతనితో చెప్పించావు. మరిచిపోయావా ? మళ్ళీ చెప్పనా? అది నందనం వనం. అక్కడ స్వేచ్ఛ రెక్కలు విప్పుకుని విహరిస్తోంది. సుఖాలకు అక్కడ ఆకాశమే హద్దు . అది భూతల స్వర్గం. నేనూ, నా రాగరాజు అక్కడ చెట్టా పట్టా లేసుకుని విహరించాలి. గోల్డెన్ గేట్ బ్రిడ్జి మీద భుజాలు భుజాలు రాసుకుంటూ నడవాలి. మిసిసిపి నదిలో పడవ నడపాలి, నయాగరా జలల్లో జలకాలాడాలి, డిస్నీలాండ్‌లో విహరించాలి, హాలీవుడ్‌లో తారలు మెరిసిపోతుంటారట. ఎల్లో స్టోన్ పార్కు అద్భుతమట! ఇవన్నీ చూడటానికి, అనుభవించటానికి డబ్బు కావాలి. ఆ డబ్బు అక్కడ గుట్టల గుట్టలు! అమెరికా అంటే డబ్బు.''

కరదీపికా దేవి సవరించుకుని అంది - ''అంతకన్నా గొప్పవే మన హిందూ దేశంలో ఉన్నాయి

గదమ్మా ! - అజంతా - ఎల్లోరా గుహలూ, కోణార్క, బేలూరు, మధుర శిల్పాలూ రాజస్థాన్ ప్రాసాదాలూ, కేరళ అడవుల్లో ఏనుగులూ, కాశీలో సప్తర్షి పూజా, హరిద్వార్‌లో గంగ హారతి, అన్నమాచార్య కీర్తనలూ, భామా కలాపం, జోగ్ జలపాతం వగైరాలు!''

రెండు మూడు క్షణాలాలోచించి దీప అంది '' అసలక్కడ మనుషులే వేరు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన వాళ్లంతా అమెరికావాళ్లే మార్లిన్ మన్రో ఎంత గొప్ప నటీమణి ! ఎలిజబెత్ టేలర్ ఎంతమందికి ఆరాధ్య దేవతో తెలుసా? చంద్రుడి మీదకాలు పెట్టిన ఆర్మ్ స్ట్రాంగ్ అమెరికన్ కదూ? కీర్తిశేషుడైన అమెరికన్ ప్రెసిడెంటు కెన్నెడీ భార్య అమెరికన్ అవ్వబట్టే కదూ, ఓనాసిస్ అనే కోటికి పడగ లెత్తిన గ్రీకు వ్యాపారి ఆమెని పెళ్లి చేసుకున్నాడు. అంతెందుకు, ఇవ్వాల్టి కివాళ మల్లయుద్ధ వీరుడు టైసన్, ఫుట్‌బాల్ ప్లేయర్ మారడోనా, ఆడవాళ్ళ టెన్నిస్ ధ్రువతార మార్టినా నవ్రతిలోవా, పాప్ గాయకులు బీటిల్స్... వీళ్ళంతా ఎవరు? బుష్ రేపు ప్రపంచం నాయకుడు కాబోతున్నాడు తెలుసా? కనుక అమెరికాలో డబ్బు సంపాదించటం అమెరికన్ అనిపించుకోవటం కన్నా గొప్ప భాగ్యం లేదు. ఎలాగోలా మనసు కుదట పరచుకుని రాగరాజును నువ్వు అమెరికా పంపాల్సింది. హూ నా కర్మ కాలి నీ చేతిలో పడ్డానూ, ఇలా దుర్మరణం పాలయ్యాను!''

దీప గొంతులో ఆవేదన ధ్వనించింది.

చటుక్కున అందుకుంది కరదీపికా దేవి ''ఆగాగు, అమ్మాయ్! ఇవన్నీ నువ్వు రాగరాజుతో చెప్పావు జ్ఞాపకముంది. కానీ అప్పుడు నువ్వు చెప్పి దాంట్లో ఏదో తిరికాసు నాకు ఇప్పుడు కనిపిస్తోంది. మార్లిన్ మన్రో బిళ్ళలు మింగి చచ్చింది. ఆర్మ్ స్ట్రాంగ్ బృందం వాళ్లు భూమ్మీదకి తిరిగొచ్చేటప్పటికి వాళ్ళ పెళ్లాలు వాళ్ళ పెళ్లాలుగా మిగల్లేదు. జాక్విలిన్ కెనడీని మారు మనువు చేసుకున్న ఓనాసిస్, జన సామాన్యం చేసే పద్ధతుల్లో కాకుండా విపరీత పద్ధతుల్లో సంసారం చేసే వాడవటం చేత వాళ్లిద్దరికీ చెడిందట! ముప్పైరెండు రోగాలున్న ఎలిజబెత్ టేలర్ మళ్లీ పెళ్లి చేసుకున్నప్పుడు ఆహ్వానం పంపించింది కానీ వెళ్లలేదు- నేను కాదులే, కొంతమంది. కారణం, అది ఏడోపెళ్లో, పదిహేడో పెళ్లో స్పష్టంగా కార్డు మీద లేదట! టైసన్ మహాశయుడి భార్య ఆయన నుంచి సగం ఆస్తి తీసుకుని విడిపోయిన వెంటనే ఆ దుఃఖంలో పాపం, ఆయన ఆడపిల్లల్ని మానభంగం చేయక తప్పలేదట. మారడోనా మందులు వాడి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడని కోర్టులో కేసు నడుస్తోంది. ఇహ మన అమ్మడు కుమారి మార్టినా నవ్రతిలోవా విషయం అంటావా - ఏం చెప్పను? ఆమె తన కున్న ఆడ స్నేహితుల్లోంచి జుడీ నెల్సన్ అనే అమ్మాయిని ఎన్నుకుని ఆమెతో కాపురం వెలగబెట్టిందట! జుడీకి మాత్రం మానవ సహజంగా ఒక కొడుకు విడాకులిచ్చిన ఒక మొగుడూ ఉన్నారట మనోవర్తి కోసం - అదే, మార్టినా తాలూకు సగం ఆస్తికోసం జుడీ కోర్టు కెక్కితే కుమారి మార్టినా ఆ కోర్టులో భోరున ఏడ్చిందట ! బీటిల్స్ బృందాన్ని వాళ్ల కొచ్చిన విపరీతమైన డబ్బూ కీర్తే కబళించాయని తెలియని వాళ్లెవరు? - మరి ఇవన్నీ మన కర్థమయ్యే విషయాలే నంటావా? అహఁ నిన్ను అమెరికా వెళ్లొద్దనలేదు. కానీ నువ్వు చెప్పిన కేసులన్నీ ఇలా డబ్బు కోసం తెగతెంపులు చేసుకుని తట్టతగలేసే కేసులే కదా, ఎలా అని అంటున్నానంతే!''

''ఈ ఆలోచన లన్నీ రాగరాజు అమెరికాకు అప్లికేషన్ పెట్టేటపుడు ఏమయ్యాయి? నువ్వెన్నన్నా చెప్పు - అమెరికా అన్నది ఒక రంగుల కల. ఆ కల నిజమవటం మన అదృష్టం''.

"నాకు ఎక్కువ తెలియదు కానీ అక్కడ అమ్మాయిలకూ, అబ్బాయిలకు ఫస్ట్ నేమ్స్ సెకండ్ నేమ్స్, థర్డ్ నేమ్స్ అని ఇంట్లో ఎన్నో పేర్లుంటాయట - అప్పటి వరకు వాళ్ల కయిన పెళ్లిళ్లను బట్టి ఒక జంటకు పెళ్లయిందంటే ఆ అమ్మాయికది రెండో పెళ్లి, ఆ అబ్బాయికది మూడో పెళ్లి అవటం చాలా సహజం ట"!

"ఈ విషయంలో నేను ఖచ్చితంగా ఉండగలనులే డబ్బుంటే ఇవేవీ సమస్యలు కావు ఇద్దరం గ్రీన్ కార్డు సంపాదిస్తాం. బోలెడు డబ్బు సంపాదిస్తాం హాయిగా బతుకుతాం అమెరికా అంటే ఏమిటి - డబ్బు !"

"అక్కడ ఐమూల ప్రేమలూ, మారు మనువులు వల్లా, ఆ డబ్బు ఎక్కువవడం వల్లా పాతికేళ్లొచ్చేసరికే అన్ని సుఖాలు అనుభవం అయిపోయి ఇక అనుభవించటాని కంటూ ఏమీ లేకపోతోందిట. దాంతో జనానికి రాను రాను మతిభ్రమిస్తోందని, ప్రతి అయిదుగురిలోనూ ముగ్గురు పిచ్చాసుపత్రికి వెళ్లొచ్చిన వాళ్లే ననీ అమెరికా వెళ్లొచ్చిన వాళ్లు చెబుతున్నారు."

"పిచ్చి కుదురుతోందిగా, గొడవేంటిక?" ... " పిచ్చి కుదిరి కుదురొస్తే మంచిదే నమ్మా! కానీ, పిచ్చి ముదిరి వాషింగ్టన్‌లోని గోల్డెన్ గేట్ బ్రిడ్జి మీద నుంచి దూకో, సీసాలకు సీసాలు మత్తు మందు ఇంజెక్షన్ చేసుకునో చచ్చేవాళ్లు ఎక్కువయ్యారట"

"గోల్డెన్ గేట్ బ్రిడ్జి ఉన్నది కాలిఫోర్నియాలో వాషింగ్టన్‌లో కాదు"

"అలాగే, పోనీలే.... ఈ చావు లెందుకంటే - మొదటి పెళ్లిలో లేని సుఖం ఏదో రెండో పెళ్లిలో ఉంటుందనే ఆశ. ఆ ఆశ రెండో పెళ్లికి, మూడో పెళ్లికి, నాలుగో పెళ్లికి - అలా బదిలీ అయ్యి అయ్యీ ఈ మధ్యలో అసలు పెళ్లితోనే సంబంధంలేని సంబంధాలు కొనసాగి, ఎక్కడా ఆ సుఖం అందక ఆ ఆశ అడియాస అని గ్రహిస్తున్నారు. చివరకు చావులోనే అసలు సుఖ ముందని తేల్చేసుకుని ఆ పని అవలీలగా చేసేస్తున్నారన్న మాట !"... "పూర్ సోల్స్! మే మలా చేయం. అమెరికా వెళ్లినా, ఆస్ట్రేలియా వెళ్లినా మా ప్రేమ చెక్కు చెదరదు. అసలు మాప్రేమ వర్ధిల్లటం కోసమేగా అమెరికా వెళ్లి డబ్బు సంపాదించాలనుకునేది. అన్నట్టు, మా గాఢ ప్రేమకు చిహ్నంగా ఏం జరిగిందో తెలుసా?"

"ఏం జరిగింది?" ఆదుర్దాగా అడిగింది కరదీపికా ' కొంపదీసి నాకు తెలియకుండా కడుపూ గిడిపూ..."

" ఛ! ఛ! పొద్దున్నే అవేం మాటలూ. అలాంటి దేం కాదు పేరు పెట్టాడు".... " పేరా? నీ కుందిగా దీపం లాంటి పేరు దీప అని పెళ్లి కాకుండానే సెకండ్ నేమా?"... "నా క్కాదు నా పొట్ట మీది ముడతలకు" ... " ఏమని?"... "కనుక్కో చూద్దాం!" ... "ఓహో! వళీ సుందరి"... "కాదు దీపావళి, దీప యొక్క ముడత కాబట్టి దీపా- వళి, దీపావళి అయిందిట, మూడు ముడతలున్నాయి. కదా ! కాబట్టి దీపావళులు అనుండాలి గదా అన్నాను కాని , జాత్యేకవచనంగా దీపావళి సరిపోతుంది అన్నాడు. అలా క్రమంగా నా ముడతలకొచ్చిన పేరు నా పేరే అయి కూర్చుంది.అతను నన్ను దీపావళి అని నోరారా పిలిచేవాడు ప్స్! ఏంటో "

" అవునవును, గుర్తుకొస్తుంది అది సరే కాని, అమెరికా గురించి నేను వింటుంది ఏమిటంటే

మనదేశంనుంచి వెళ్లిన వాళ్లను ప్రత్యేకంగా గుర్తుపెట్టుకుని అవమానించి, హింసిస్తున్నారట ముఖ్యంగా ఆడవాళ్లను 'డాట్ బస్టర్స్' అనే ముఠావాళ్లు. ఇప్పుడు చెప్పు అమెరికా అంటే ఏమిటి డబ్బా?- కాదు, జబ్బు" " ఓస్ కట్టూ, బొట్టూ, జుట్టూ వల్లనే కదా ! నువ్వు నన్ను ఫ్లైట్‌లో ఎక్కించాలే గానీ ఎక్కేటప్పటికే నేను అచ్చు అమెరికన్ అమ్మాయిలా మారిపోనూ!" 'అప్పటికి రాగరాజు అమెరికాలో ఉంటే నిన్ను గుర్తుపట్టలేడేమో?"

"కావచ్చు. మొదట్లో కొంచెం సేపు ఉడికిస్తాన్లే నేను విమానం దిగి లాంజ్‌లో కెడుతుంటాను మిగతా పాసింజర్లతో కలిసి అతను నన్ను గుర్తు పట్టలేక దూరం నుంచి ' దీపావళి !' అని కేకేస్తాడు " నేను- డీప్‌గా కావాలి - అని వినిపించీ, వినిపించనట్లుగా అంటాను. అతను మళ్లీ 'దీపావళి!' అని గట్టిగా కేకేస్తాడు. నేనే మళ్లీ -డీప్‌గా కావాలీ- అని అంటాను. ఇలా నాలుగైదు సార్లు అయ్యాక అతను డీప్‌గా ఊపిరి తీసుకుని గొంతు చించుకుని 'దీపావళి ళ్ ళ్లీ' అంటాడు. నేను దగ్గర కెళ్లి 'హాయ్! హనీ, నే నిక్కడే ఉన్నాను' అంటాను. అతను నన్ను గుర్తు పడతాడు. కౌగలించుకుంటాడు. చటుక్కున అరిసెల్లా అతుక్కుపోతాం. ఈ ఘాటు ప్రేమ విషయం తెలిసి కూడా నా కథను నువ్వు పూర్తిగా రాయలేదు ఎందుకు రాయలేదని ఆవేదనతో అడుగుతున్నా. ముందరిది చెప్పు ! అమెరికా విషయం తర్వాత"

"రాయబోయా నమ్మా! కాని, సిరా అయిపోయింది"..."మళ్లీ పోసుకోవచ్చుగా?"... "వేళ్లు వంకరపోయాయి"..." ఎడమ చెయ్యి ఏమయింది?"... "పడిపోయింది "..."సరే, నోరు. నోరుందిగా!' ..."నుర గొచ్చింది"..."చూపు?"... "నిలిచిపోయింది"... "ఓహో, కట్టెను వదిలేశావన్నమాట?!!

"లేదు కట్టెలోనే ఉన్నాను. నా టైపిస్టు ఇంజక్షన్ ఇప్పించేటప్పటికి మళ్లీ స్పృహ వచ్చింది. అప్పుడు నీ కథ విషయం జ్ఞాపకం వచ్చి ఆదరా బాదరా ఆ మూడు వాక్యాలూ రాసి ఎలాగోలా ముగించేశాను. అలా ముగించానో, లేదో మళ్లీ స్ట్రో కొచ్చింది. వారంబట్టీ అలా స్పృహ లేకుండానే పడున్నాను. నిన్ననే పట్టింది నాకీ మహర్దశ. ఏం చేయను?"

దీప రెండు క్షణాలు ఆలోచించి అంది "అంటే నన్నింక అమెరికా పంపే ఏర్పాటు చెయ్యలేవన్నమాట!'.. "ఇకిప్పుడేం చేయగలను? నేను మళ్లీ భూమ్మీద కొచ్చి ఏ వైట్ హౌస్‌లోనో పుడితే అప్పటిదాకా మీ ప్రేమ ఇలాగే పచ్చగా ఉంటే ఆలోచిస్తాలే"

దీప తెల్లబోయింది. "వైట్ హౌస్ ఎక్కడుందో తెలుసా?"... "కలకత్తాలో అది రవీంద్రనాథ్ టాగూరు ఇల్లు కదూ?"..."కాదు వాషింగ్టన్‌లో - అమెరికా ప్రెసిడెంటు ఇల్లు అవునూ, ఇందాకటి నుంచి చూస్తున్నాను నీకు ఆడపిల్లల సైకాలజీ తెలియదు, అమెరికా గురించి అసలు తెలియదు. ఏం తెలుసని నా కథ రాయబోయావమ్మ రచయిత్రి?"

"నువ్వు మాత్రం నేను అవునన్నది కాదంటావు కాదన్నది అవునంటావు. ఏం హీరోయిన్‌వి?" అని కొన్ని క్షణాలు మౌనం వహించింది కరదీపికా దేవి చివరకు గద్గద స్వరంతో అంది - " ఏం తెలిసినా, తెలియకపోయినా సొంత కథ అంటూ ఒకటుంటుందిగా ఎవరికైనా! అది తెలుస్తుందిగా"

నిశితంగా చూసింది దీప " అంటే నీ కథే నా కథా?"..."అవును"... "వాహ్వా! అవునూ నీకసలు పెళ్లయిందా?"... "లేదు"... " నీ బాయ్ ఫ్రెండ్ అమెరికా వెళ్లాడా?"... "అవును"... "నువ్వు కూడా వెళ్లాలనుకున్నావా?"... "అవును"... "కానీ అతను నిన్ను రావద్దన్నాడు అవునా?"... ..."ఊఁ"

"అదీ కథ! నిన్ను అతను విదిలించేశాడు. అక్కడి నుంచీ ఓ కాబరే డాన్సర్‌నో, ఎవత్తెనో ఓ తుప్పతలదాన్ని నెత్తినెక్కించుకుని వచ్చాడు నువ్వతన్తో పోట్లాడావు. అదంతా అతనిష్టమన్నాడు. అతనక్కడ కలకత్తాలో కాపురం పెట్టాడు, నువ్విక్కడ కలతలపాడులో కథలు రాసుకుంటున్నావు. ఇదీ నీ సొంత కథ రిలీఫ్ కోసం ఇప్పుడీ నవల మొదలెట్టావు. ఇందులో నీ సొంత కథ చొప్పించావు. నన్ను సృష్టించావు. ఆ ఆవేశంలో నీకు పక్షవాతం స్ట్రోకొచ్చింది. అవునా? అర్థమయింది. సరే నీకు స్ట్రోకు రాకపోయుంటే నా కథను ఎలా ముగించేదానివి?"

కరదీపికా దేవి తన్నుకొచ్చే దుఃఖాన్ని దిగమింగుకుంది.

"మొదట నిన్ను చంపేదాన్ని కాదు. రాగరాజు పిలానీలో ఇంజనీరింగు చదివి మన హిందూ దేశంలోనే ఉద్యోగంలో చేరతాడు. దీపను పెళ్లి చేసుకుంటాడు (సన్నగా ఏడుపు) అయి దారేళ్లయ్యాక కంపెనీ పనిమీద, ట్రైనింగు కోసమో అమెరికా వెడతాడు దీపను తీసుకునే. నాలుగేళ్ల తర్వాత బోలెడు డబ్బుతో తిరిగొచ్చి సొంతంగా కంపెనీ పెడతాడు".

"ఆగాగు. కంపెనీ వాళ్లు రాగరాజును పంపించకపోతే?"

"నష్టమేముంది? ఇక్కడే ఉండి తన సొంతకంపెనీ పెట్టి పదిమందికి ఉద్యోగాలిస్తాడు తన ఆదాయంతో తృప్తి పడి ప్రశాంతంగా జీవిస్తాడు".

కంగారుగా అంది దీప- "అంటే, రాగరాజు అసలు అమెరికా వెళ్లడన్నమాట. కనుక దీప గతి కూడా అంతే నన్నమాట మై గాడ్! ఎంత దుర్మార్గపు ఆలోచన! నాలో ఆశలు రేపి అప్పుడేమో నా చేత హాలీవుడ్డూ, గాడిద గుడ్డూ అని డైలాగులు చెప్పించావా. ఇప్పుడేమో నన్ను ఏ ఆశలు తీరని ఓ జీవచ్ఛవాన్ని చేసి కథ ముగిస్తానంటావా? ఎంత సాహసం! కాదు, కాదు, వెన్నుపోటు. చూడగా చూడగా జీవచ్ఛవంలా బతకటం కంటే నేను మరణించటమే మంచిదయిందనిపిస్తోంది".

హఠాత్తుగా కరదీపికాదేవి- "అదుగో, నాకు ఉచ్చు బిగుస్తోంది. నేనింక ఆగలేను వెళ్లిపోతున్నాను." హడావుడిగా అంది దీప-" ఆగాగు, జస్ట్ ఒన్ పాయింట్. అయిందేదో అయింది. నన్ను అమెరికాలో సెటిల్ చేసే రచయిత్రులెవరున్నారో చెప్పు. పై జన్మలో నయినా నన్ను తన దాన్ని చేసుకుని నా కలలు పండించమని వెళ్లి ఆవిడని బతిమాలుకుంటాను. ఇదిగో కరదీపికా దేవీ! నిన్నే...!" కరదీపికా దేవి తాలూకు నీలి రంగు వలయం పైపైకి సాగిపోవటం మొదలు పెట్టింది.

మరికొన్ని వలయాలు కూడా సమాధిలోంచి రావటం మొదలు పెట్టాయి. దీప గాఢంగా నిట్టూర్చి రయ్ మని వెళ్లిపోయి రచయిత్రి ఇంట్లో ఆమె రాత ప్రతిలో ఇమిడిపోయింది.

★ ★ ★

ఇంకో గంట గడిచింది. రచయిత్రి కరదీపికాదేవి ఇంట్లోకి ఇద్దరు దొంగలు దూరారు. ఒకడు ముప్పైయేళ్ళ యువకుడు, రెండోవాడు అంతకంటే కుర్రాడు. ఇద్దరూ వెళ్లి రచయిత్రి బీరువా తెరిచారు. అర్థంతరంగా ముగిసిన ఆ నవల రాత ప్రతిని యువకుడు తీసాడు. రెండో వాడితో సన్నగా అన్నాడు.

"ఉత్త కథను భరించొచ్చు. చెత్త కథ నయినా భరించొచ్చు. కానీ మత్తుకథను భరించకూడదు. ఇదొక మత్తు కథ. ఈ కథ లేనిపోని ఆశలను కల్పించి యువతరానికి పిచ్చెక్కిస్తోంది. రచయిత్రి మంచిదే.

కానీ ఏం లాభం సగమే రాసి మరణించింది. ఆ రాసిన సగంలోనూ హీరోయిన్ చేత అమెరికా గురించిన మత్తు మత్తు డైలాగులు చెప్పించింది. ఈ నవల చదివిన ప్రతి యువకుడూ యువతీ 'అమెరికా వెళ్లకపోవటం దురదృష్టం! అసలు అమెరికాలో పుట్టకపోవటమే గొప్ప దౌర్భాగ్యం' అని అనుకునేటట్లు చేసింది. రచయిత్రి బతికే ఉంటే కథను ఎలా ముగించి ఏం ఉపకారం చేసేదో తెలియదు కానీ ఇంతవరకూ రాసిన దాంతో మాత్రం ఆమె అపకారమే చేసింది. విదేశీ సంస్కృతి పట్ల మోజునూ, స్వదేశీ సంస్కృతి పట్ల చిన్న చూపునూ పెంచే ఈ నవల యువత చేతుల్లో పడటం ప్రమాదకరం కానీ ఈ కథకు గొప్ప పబ్లిసిటీ ఇస్తున్న పబ్లిషరు రేపాస్తున్నాడు దీన్ని తీసుకెళ్లటానికి. వాడి కిదిదక్కకుండా చేయటం చాలా అవసరం. రచయిత్రి తాలూకు టైపిస్టుగా ఆమెకున్న మంచి పేరును నిలబెట్టడానికి దీన్ని నాశనం చేయటం నా ధర్మం అందుకో, నడు!" అన్నాడు.

ఆ రాత ప్రతితో ఇద్దరూ బయటకు నడిచారు. ఊరి బయట ఉన్న ఆ శ్మశానం దగ్గరకు వెళ్లారు. యువకుడన్నాడు - " ఈ రోజు దీపావళి. అజ్ఞానాన్ని లోభ మోహాల్నీ మత్తునూ నాశం చేయవలసిన రోజు. అందరూ ఆ పని నూనె దీపాలతో చేస్తారు. మనం కాగితం దీపాలతో చేద్దాం. ఆ కాగితాలన్నింటినీ బొత్తులు బొత్తులుగా దూరం దూరంగా పెట్టు " అన్నాడు.

ఆ కుర్రాడు అలాగే చేశాడు. యువకుడు అగ్గిపెట్టెతో ఆ బొత్తులన్నిటికీ వరుసగా నిప్పంటించు కుంటూ పోయాడు. మరు నిముషంలో ఒక పది గజాల పొడుగున అగ్ని జ్వాలలు పైకి లేచాయి. "చూశావా, ఇదీ దీపావళి ! దీప - ఆవళి అంటే దీపాల వరుస. అంధకారాన్ని తరిమేసే వరుస. నాకిప్పుడు తృప్తిగా ఉంది అసలైన వరుస. నాకిప్పుడు తృప్తిగా ఉంది అసలైన దీపావళి జరుపుకున్నందుకు. ఇక పోదాం పద" అన్నాడు యువకుడు. ఆ ఇద్దరూ అక్కడ నుంచి కదిలారు.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 6-11-91)

★★★ ★★★ ★★★

# న్యాయం

సుబ్బమ్మ : దీన్సిగదరగ, ఎంతపజ్జరిగింది! నెత్తికి సేతులొచ్చేసాయి. పెట్లోంచి దీసి సాయిట్టో బల్లమీదెట్టి పొయ్యి కాడికి నడిశానో లేదో అయ్యకూడా నడిశేశాయి. ఆదిలోకి! ఒకటా, రెండా, అయిదొందలు- అయిదు తెల్లనోట్లు ఎట్టా కట్టబడ్డాను! అన్నింటికీ ఆ రెండు గొడ్లేగా ఆదారం! పాలమ్మాను పిడకలమ్మాను. నేను సంపాదిత్తన్నానని అంతా నన్నాడిపోసుగోటమే! ఈది సివర నాగరత్నం కన్నా, ఎలట్రీస్తంబంకాడ సాయిత్రికన్నా ఎక్కు కలిపానా ఏంటి నీళ్లు? ఇంతసేపు సచ్చినా ఆ ఒడ్డాణం తాకుట్టుకే పోయిందిగా! అది ఇడిపించాలనే గందా ఈ డబ్బు కూడబెట్టింది!! ఇయ్యాల డబ్బిచ్చి అది ఇడిపించుకోక బోతే తాకట్టు వాకట్టవుద్దని సావుకారు కబుర్జేశాడు. ఇది కాత్తా పోయిందా .. నగ యిడిపించడానికి ఇంకో నగ తాకట్టు పెట్టాలా ఏంది? ఓరి నాయనో, ఇదేం కర్మరా దేవుడా ! ఇంటి మగాడికి, నాకు సెడబట్టేగాని లాకపోతే నేనింత దయిద్రం అనుబయించేదాన్నా?

ఇంతకీ ఇదంతా ఆ ముష్టాడి పనే. ఆ ఎదవ సచ్చినోడొచ్చినప్పుడేగా నేనింటో కెల్లింది. అదే